క్లుప్తంగా

ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేయండి



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న డీఆర్డీవో సంపత్‌రావు

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీఆర్డీవో సంపత్‌రావు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు, రిజిష్టర్ల నమోదు, ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల వద్ద సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం సమత, వీవోఏలు, సీసీలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న నరేశ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతోపాటు అమ్మక్కపేటలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవో నరేశ్ తనిఖీ చేశారు. కేంద్రంలోని ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. తేమశాతం వచ్చిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. అకాల వర్షాలు పడుతున్నందున రైతులకు టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీశ్‌కుమార్, సిబ్బంది రాజేశ్, శ్రీకాంత్, శశి, రైతులు పాల్గొన్నారు.

డబ్బు చెల్లింపులో జాప్యం చేయొద్దు



కొనుగోళ్లను పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

మెట్‌పల్లి: రైతులకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన డబ్బుల చెల్లింపుల్లో జాప్యం చేయవద్దని సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట, చౌలమద్దిలలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం నిల్వలు తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోళ్లల్లో జాప్యం చేయవద్దని, అలాగే కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సిబ్బందికి సూచించారు.

దాడి చేసినవారిని అరెస్ట్ చేయాలి

మెట్‌పల్లి: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో ఇటీవల వైద్య సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని ఐఎంఏ మెట్‌పల్లి అధ్యక్షుడు గంగసాగర్ కోరారు. ఈ ఘటనలో ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే బాధ్యులను అరెస్ట్ చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

గల్ఫ్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న యూత్ సభ్యులు

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు మహమ్మద్ నబీ ఇటీవల సౌదీలో మృతిచెందాడు. అతడి కుటుంబానికి ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రూ.85,016 సాయం చేశారు. పాక్స్ చైర్మన్ ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ దారిశెట్టి రాజేశ్, యూత్ అధ్యక్షుడు బాదినేని కాశిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

మేడిపల్లి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను మేడిపల్లి, భీమారం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఏనుగు రమేశ్‌రెడ్డి, చేపూరి నాగారాజు, మరిపెల్లి స్వామిగౌడ్, బొమ్మెన ప్రశాంత్, రేండ్ల మధు, భర్కం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సా..గుతున్న పనులు



నిర్మాణంలో ఉన్న కళాశాల భవనం

మెట్‌పల్లి: పట్టణంలో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు నత్తే నయమన్నట్లుగా సాగుతున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు..ఐదేళ్లుగా సాగుతున్న పనులు ఇంకా పూర్తి కావడం లేదు. మరో ఇరవై రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. కానీ, ఆ లోపు పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో కళాశాల సిబ్బంది, విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

- ఐదేళ్ల క్రితం జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శ్రీకారం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. పనుల్లో జాప్యం
- ఇప్పటికీ పూర్తికాని వైనం

రూ.2.60 కోట్లతో కొత్త భవనం

పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని నిర్ణయించి ప్రభుత్వం సుమారు రూ.2.50కోట్లు మంజూరు చేసింది. 2018లో పనులకు శ్రీకారం చుట్టగా.. ఇప్పటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. ఇప్పటికే నిర్మాణం పూర్తయి భవనం వినియోగంలోకి రావాల్సి ఉంది. కానీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ఆగుతూ, సా..గుతుండడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో కొత్త భవనంలో కళాశాల నిర్వాహణ కోసం ఎదురు చూస్తున్న సిబ్బంది, విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది.

పాత భవనం శిథిలావస్థకు..

దశాబ్దాల క్రితం నిర్మించిన పాత కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు ఉన్న గదులు సరిపోక, సరైన వసతులు లేక సిబ్బంది, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు అదనంగా మూడు ఒకేషనల్ కోర్సులున్నాయి. ఫస్టియర్, సెకండియర్ కలుపుకొని సుమారు 500 మంది విద్యార్థులు ఉంటారు. లైబ్రరీ, ల్యాబ్, తరగతుల నిర్వహణకు పాత భవనంలో పది వరకు గదులు ఉన్నాయి. వీటి గోడలు, పైకప్పు ఎక్కడికక్కడే దెబ్బతిన్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో సిబ్బంది, విద్యార్థులు భయాందోళనల మధ్య చదువులు సాగిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన పాత భవనం

అభివృద్ధి, ఉపాధికి కేరాఫ్ కాంగ్రెస్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి



జగిత్యాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న విజయలక్ష్మి

జగిత్యాల/మల్లాపూర్/రాయికల్/ఇబ్రహీంపట్నం/కోరుట్ల/కోరుట్ల రూరల్/సారంగాపూర్: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జగిత్యాల పట్టణంలోని పలు వార్డులు, హస్నాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పిన మాదిరిగానే బీజేపీకి చెప్పాలన్నారు. జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. లావణ్య, ఎంపీటీసీ మల్లారెడ్డి, రజిత, గంగాధర్ పాల్గొన్నారు. మల్లాపూర్ మండల కేంద్రం శివారులో కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయికల్ మండలం మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాల్లో జీవన్‌రెడ్డికి మద్దతుగా ఆయన కోడళ్లు హరితరెడ్డి, చరిష్మారెడ్డి ప్రచారం చేశారు. ఇబ్రహీంపట్నం మండలం కొజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో జేఎన్ వెంకట్ ప్రచారం చేశారు. కోరుట్ల పట్టణంలోని 16,29వ వార్డుల్లో కౌన్సిలర్ బలిజ పద్మ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. మల్లాపూర్ మండలం రేగుంటలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు ప్రచారం చేశారు. పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కూన గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు. కోరుట్లరూరల్ మండలం నాగులపేట, సంగెం గ్రామాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. మండల అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెమండ్ల సత్యనారాయణగౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన న్యాయవాదులు లక్ష్మారెడ్డి, పురుషోత్తం, శేఖర్ తదితరులు రాయికల్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. చేతిగుర్తుకు ఓటు వేసి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కోల జమున, బొడ్డుపల్లి రాజన్న, కోండ్ర రాంచంద్రారెడ్డి, గుడిసె జితేందర్, ఎండబెట్ల గ్యాబ్రియల్ ప్రచారం చేశారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

మేడిపల్లి: బీఆర్ఎస్ ఉమ్మడి మేడిపల్లి మండల ఉపాధ్యక్షుడు, యాదవసంఘం భీమారం మండల అధ్యక్షుడు రెబ్బస్ మల్లయ్య బుధవారం వేములవాడ మోదీ సభలో బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఆధ్వర్యంలో ఆపార్టీలో చేరారు. మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నుంచి 50 మంది ముఖ్య కార్యకర్తలు బీజేపీలో చేరారు. కోటగిరి లింగంగౌడ్, అడువాల గంగారాం, నాంపెల్లి రాజు, అడువాల లింగారెడ్డి, వన్నెల శివానందం, గోనేల రవి, ఆకునూరి రాజం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే సత్యం

మల్యాల/కథలాపూర్/మేడిపల్లి: మల్యాల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామ అధ్యక్షుడు కొత్తకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రామన్నపేట, తాటిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కుటుంబ సభ్యులు శోభ, అరవింద, అనురాధ, వెలిచాల నిశాంత్‌రావు ప్రచారం చేశారు. ఉపాధి కూలీలతో సమావేశమై మద్దతు తెలుపాలని కోరారు. మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం సిరికొండలో వివిధ కులసంఘాల వద్ద బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు మ్యాదరవేని రాజు, ఎండీ రేహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. మేడిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మాచాపూర్, దమ్మన్నపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఉపాధి కూలీలకు అరటిపండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, సాయిని గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మేడిపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీని నమ్మి మోసపోవద్దని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి మండలం మేడిపల్లి, రాజేశ్వర్‌రావుపేట, చెర్లకొండాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలను కలిసి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పీసు తిరుపతిరెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, ఎంపీటీసీ గంగాధర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కోరుట్ల/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్: బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ గెలుపును కాంక్షిస్తూ కోరుట్ల పట్టణం 4వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి యాటం కృష్ణ, ఉపాధ్యక్షుడు సామల వేణు గోపాల్, పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేటలో విండో మాజీ చైర్మన్ అల్లూరి రఘుపతిరెడ్డి, నాయకులు ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అందిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. తేలు రాజు, రామకిష్టు, గంగాధర్, నల్ల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పోలింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

ఇబ్రహీంపట్నం: పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ బూత్‌లలో ఆయా గ్రామ కార్యదర్శులు ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి కార్యదర్శులకు సూచించారు.

రూ.3.30లక్షలు పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.3.30లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

రూ.28 వేల విలువైన టీషర్ట్‌లు స్వాధీనం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మోచీబజార్‌లో బుధవారం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా గుండేటి శ్రీనివాస్ అనే వ్యక్తి ఎలాంటి బిల్లు లేకుండా తీసుకెళ్తున్న రూ.28 వేల విలువ గల టీషర్ట్‌లు, లోయర్‌షార్ట్స్‌ను సీజ్ చేశారు.

మద్యం పట్టివేత

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపల్లి, బొమ్మెన గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో రూ.25 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామశివారు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

లారీ, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

మేడిపల్లి: లారీ, బైక్ ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. భీమారం మండలం మన్నెగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంనుంచి ఓ లారీ వడ్ల లోడుతో వెళ్తోంది. అదే సమయంలో కల్వకోటకు చెందిన కటుకం వంశీ, బిహార్ కూలీ బైక్‌పై వస్తున్నారు. దమ్మన్నపేటకు చేరగానే లారీ, బైక్ ఢీ కొంది. వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

బాలిక కిడ్నాప్

సారంగాపూర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కిడ్నాప్‌నకు గురైనట్లు పోలీసులు బుధవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌కు అండగా ఉండాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాపురెడ్డి, నాయకులు

కథలాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అండగా ఉండాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. బుధవారం మండలంలోని భూషణరావుపేట, ఊట్‌పెల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు బీఆర్ఎస్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు ముస్కు శ్రీనివాస్, తీట్ల శంకర్, గడ్డం శేఖర్‌రెడ్డి, వినోద్‌రావు, జనార్దన్‌రెడ్డి, పుర్కుటపు గంగారెడ్డి, శనిగారపు గణేశ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో 2009-10 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థుల సమ్మేళనం బుధవారం శ్రీంకారేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగింది. ఈసందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. సాయంత్రం వేళ సామూహిక భోజనాలు చేశారు. ఒకరికొకరు ఆటోగ్రాఫ్ తీసుకొని మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ సమావేశాన్ని ముగించేశారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఉపాధి కూలీలకు వసతులు కల్పించండి

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు అన్ని రకాల వసతులు కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అధికారులకు సూచించారు. బుధవారం జెడ్పీ ఆఫీస్ నుంచి వర్చువల్ పద్ధతిలో జిల్లా అధికారులతో మాట్లాడారు. వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున కూలీలు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని, కింది స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని డీఆర్‌డీవోను కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



అధికారులకు విన్నవిస్తున్న గ్రామస్తులు

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో కొన్నేళ్ల నుంచి ఓవర్ లోడ్‌తో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, పరిష్కరించాలని గ్రామస్తులు బుధవారం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల రోజూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే గ్రామానికి చెందిన లైన్‌మెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గ్రామస్తుల సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దినేశ్ వారికి మద్దతు తెలిపాడు. ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరాడు. ఉన్నతాధికారుల అనుమతితో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని విద్యుత్ సబ్ ఇంజినీర్ రాకేశ్ తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలు హర్షణీయం



వేడుకల్లో సంస్థ ప్రతినిధులు తదితరులు

జగిత్యాల/జగిత్యాలటౌన్: రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తదాన శిబిరాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్, రెడ్‌క్రీసెంట్ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ టీఆర్‌నగర్ బస్తీ దవాఖానాలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం మొబైల్ మెడికేర్ యూనిట్ ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ వైద్యుడు కృష్ణతేజ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వెటర్నరీ ఏడీ డా.బోనగిరి నరేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుందారపు లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంచాల కృష్ణ, బస్తీ దవాఖాన వైద్యుడు సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు ఓట్లడిగే అర్హత లేదు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్ : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఓట్లడిగే అర్హతే లేదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి మండలం కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. అంతకు ముందు ఉదయం ముత్తునూర్, రాంనూర్, కొండాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ విప్, మంత్రిగా పని చేసిన ఈశ్వర్ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదని విమర్శించారు. కాళేశ్వరం లింక్–2లో భాగంగా మూడు పంటలు పండే భూములను గుంజుకొని అరకొర పరిహారం ఇస్తే ఒక్కమాట కూడా మాట్లాడకుండా అన్యాయం చేశారన్నారు. పదేళ్లుగా ప్రజా సమస్యలు గాలికి వదిలేసి, మళ్లీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తూ మరోసారి మోసం చేసేందుకు వస్తున్న కొప్పులకు ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప బీజేపీ వాళ్లు చేసిందేంలేదన్నారు. ప్రజా కుటుంబం నుంచి వచ్చిన గడ్డం వంశీని గెలిపించాలని కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు మురళి, మంజుల, రమేశ్, బషీర్, సందీప్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

పెగడపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా మండలంలోని ఏడుమోటలపల్లి, నంచర్ల, నందగిరి, వెంగళాయిపేట తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. రాములుగౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల సతీమణి ఇంటింటా ప్రచారం



సుద్దపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న స్నేహలత

పెగడపల్లి/ధర్మపురి: బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం ఆయన భార్య స్నేహలత ప్రచారం చేశారు. బుధవారం మండలంలోని సుద్దపల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఈశ్వర్ అందించిన సేవలు, అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ఈజీఎస్ కూలీలను కలిసి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలపై వివరించారు. కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. మల్లారెడ్డి, వెంకన్న, నర్సింహారెడ్డి, గంగాధర్, రమణారెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, సత్తయ్య, రవి, రాజశేఖర్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, తిరుపతినాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ధర్మపురి మండలంలోని రామయ్యపల్లె, తిమ్మాపూర్, నక్కలపేట, తుమ్మెనాల గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకురాలు మోకెనపల్లి రాజమ్మ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ చేసింది శూన్యం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

పెగడపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపొందడం ఖాయమని ప్రజా సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గజ్జెల కాంతం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణ ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. ప్రస్తుతం ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మారోమారు అధికారంలోకి వస్తే రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర పన్నుతుందని, రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై రాజ్యాంగంలో పొందపరిచిన హక్కులను కాపాడుకునేందుకు కేంద్రంలో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా సుభాష్



సుభాష్

మల్లాపూర్: మల్లాపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం–1 అధ్యక్షుడిగా దొంతి సుభాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పోలాస రాజయ్యచారి, కోశాధికారి శ్రీరాముల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. అనంతరం సుభాష్ మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి తోడ్పాడుతామని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామ వేంకటేశ్వరస్వామి దేవస్థానం శాశ్వత అన్నదాన ట్రస్ట్ చైర్మన్‌గా ఎర్రవేణి రవీందర్ ఎన్నికయ్యాడు. ఉపాధ్యక్షుడిగా కొప్పుల దేవి, ప్రధాన కార్యదర్శి కట్ట రాజేశ్, కోశాధికారి కొల్లూరి రాజేశ్, ప్రచార కార్యదర్శి అత్తినేని నాగరాజు, సంయుక్త కార్యదర్శి గొడ్డండ్ల శేఖర్, చిల్కుల ప్రేమ్‌చంద్, గౌరవ సలహాదారులు మండ రవి, వేముల సతీశ్, శ్రీరాముల గణపతి, బాలె చంద్రశేఖర్, అత్తినేని గంగారెడ్డి, మోర వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.